సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



మార్మోగిన రామనామం

శ్రీరామ పునర్వసు దీక్ష చేపట్టిన భక్తులు విరమణకు తరలిరావడంతో భద్రాచల క్షేత్రం రామనామంతో మార్మోగింది.

8లో



కలెక్టరేట్ ఎదుట జేపీఎస్‌ల ధర్నా

డిమాండ్ల సాధన కోసం సమ్మెకు సిద్ధమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

8లో

గరిష్టం / కనిష్టం
37° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగానే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

యాసంగి అల్లకల్లోలం



బోనకల్ మండలం ముష్టికుంట్లలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)



నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో ఆరబోసిన ధాన్యం

అకాల వర్షాలతో గల్లంతైన రైతుల ఆశలు

- కోత దశ, అమ్మకం సమయంలో నీళ్లు చల్లిన వరుణుడు
- పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తిన ధాన్యం
- కంకి దశతో పాటు కల్లాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న

సాక్షిప్రతినిధి, ఖమ్మం: యాసంగి సీజన్‌లో రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఈ సీజన్‌లో అకాలవర్షాలు, వడగండ్ల వానలు వెంటాడుతుండడంతో పంటలు దెబ్బతిన్నాయి. అయితే, వర్షం ముప్పు ఇంకా తొలగిపోకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తగా.. మొక్కజొన్న రైతుకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోగా.. ఉన్న కొద్ది పంటనైనా అమ్ముకుందామంటే మార్క్‌ఫెడ్ కేంద్రాలు లేక దళారులు తక్కువ ధరకే దోచుకుంటున్నారు.

అగమాగం..

జిల్లాలో యాసంగి సీజన్‌లో అన్ని పంటలు కలిపి 3,15,375 ఎకరాల్లో సాగు చేయగా, వరి 2,14,868 ఎకరాలు, మొక్కజొన్న 91,225, పెసర 3,463, ఇతర పంటలు 5,819 ఎకరాల్లో సాగయ్యాయి. ఉపరితల ద్రోణి కారణంగా గతనెల 17 నుంచి 20 వరకు ఈదురుగాలులతో కూడిన వర్షంతో జిల్లా వ్యాప్తంగా 31,038 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మొక్కజొన్న దాదాపు 30,792 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించగా, గత నెల 23న ముఖ్యమంత్రి కేసీఆర్ బోనకల్ మండలంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. సహాయ పునరావాసం కింద ఎకరాకు రూ.10 వేలు ప్రకటించడంతో అధికారులు 18,258 మంది రైతులు 23,632.17 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు నివేదించారు. దీంతో ఇటీవల ప్రభుత్వం రూ.23,63,24,250 పరిహారాన్ని మంజూరు చేసింది. ఈ పరిహారం ఇంకా అందకపోగా, జాబితాలో పేర్లు లేవని రైతులు ఆందోళన చేస్తుండగానే గత నెల 31, ఈనెల 21, 23 తేదీల్లో మళ్లీ ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షంతో రావడంతో మరింత నష్టం వాటిల్లింది.

పంట దెబ్బతిని.. మద్దతు ధర లేక..

యాసంగిలో ఆశాజనకంగా ఉంటుందని మొక్కజొన్న రైతులు భావిస్తుండగా అకాల వర్షాలతో కంకి దశలో నేలవాలింది. సాధారణంగా మొక్కజొన్నను మిషన్‌తో కోయిస్తే ఎకరానికి రూ.3,500 ఖర్చు అవుతుంది. అయితే మొక్క కింద పడటంతో కూలీలను పెట్టడంతో ఎకరానికి రూ.12 వేల వరకు ఖర్చయింది. మక్కలు కల్లాల్లో ఆరబోశాక మరోసారి వర్షాలు రావడంతో ఫంగస్(బూజు) వచ్చింది. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.1,960 మద్దతు ధర ప్రకటించినా మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయ లేదు. ఈ కారణంగా వ్యాపారులు రూ.1,500కే అడుగుతుండడంతో చేసేదేం లేక రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది.

క్వింటా రూ.1,500కే అడుగుతున్నారు..



పది ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తే వర్షానికి నేలమట్టమైంది. కూలీలతో కోయించడంతో ఖర్చు పెరిగింది. కల్లాల్లో ఆరబోశాక మళ్లీ వర్షం రావడంతో తడిసి ఫంగస్ వచ్చింది. దీంతో ప్రైవేట్ వ్యాపారులు రూ.1,500కే అడుగుతున్నారు. ఓవైపు దిగుబడి తగ్గి.. మరోవైపు మద్దతు ధర లేక నష్టపోయినట్లే.

– పిల్లలమర్రి నాగేశ్వరరావు, రైతు, ముష్టికుంట్ల

ధాన్యం తడిసి మొలకెత్తి..



ఈ ఫొటోలోని రైతు నేలకొండపల్లి మండలం నాచేపల్లికి చెందిన చుంచు హన్మంతరావు. 12 ఎకరాల్లో వరి సాగు చేసిన ఈయన ధాన్యం అమ్మేందుకు నాలుగు రోజుల క్రితం నాచేపల్లి కేంద్రానికి తీసుకొచ్చాడు. కాంటాలు ఆలస్యం కావడం, ఇంతలోనే వర్షం రావడంతో ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తింది. కనీసం టార్పాలిన్లు ఇచ్చినా ధాన్యాన్ని కాపాడుకునేవాళ్లమని హన్మంతరావు కన్నీటి పర్యంతమవుతున్నాడు. మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నాడు.

ఈ సీజన్‌లో పంట నష్టం వివరాలు..

పంట నష్టం	32,822 ఎకరాలు
రైతుల సంఖ్య	25,659
తొలివిడత పరిహారం	రూ.23,63,24,250

కాంటాలు వేయకపోవడంతో..

మరోపక్క కొనుగోలు కేంద్రాల వద్దకు వరి ధాన్యం తీసుకొచ్చిన రైతులు మబ్బు పట్టినప్పుడల్లా ఆందోళనతో పంటను కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్నారు. కాంటాలు ఆలస్యమవుతుండడంతో రాశుల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. బస్తాలు, టార్పాలిన్లు లేకపోవడంతో వర్షం వస్తే ధాన్యం తడుస్తోంది. అయితే, గోడౌన్‌లు ఖాళీ లేకపోవడంతోనే కాంటాలు ఆలస్యమవుతున్నాయని సమాచారం. ఈ యాసంగిలో 232 కొనుగోలు కేంద్రాలను తెరవాలని నిర్ణయించగా.. గురువారం వరకు 69 కేంద్రాల ద్వారా 991మంది రైతుల నుంచి 8,198 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు..



జిల్లా రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నాం. వరికోతలు జరుగుతున్న ప్రాంతాల్లో కేంద్రాలు తెరిచాం. మూడు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయడానికి 60 లక్షల బస్తాలు ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి కొరత లేదు. ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేయాలని నిర్వాహకులను కూడా ఆదేశించాం.

– ఎస్.మధుసూదన్, అదనపు కలెక్టర్

విద్యాప్రమాణాల పెంపుపై దృష్టి

కలెక్టర్ వీ.పీ.గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన డీఈఓ శర్మ, డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో విద్యాప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన విద్యాశాఖ, ఇంజనీరింగ్, తొలిమెట్టు నోడల్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు చేపట్టిన తొలి మెట్టులో స్వల్పకాలిక లక్ష్యాలను సాధించాలన్నారు. ఇక మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల్లో మిగిలిపోయిన వాటిని పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ కన్నా ఎక్కువ అడ్మిషన్లు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఈసమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు నాగేషు, శ్యాంప్రసాద్, హేమలత, కృష్ణలాల్, శ్రీనివాస్, చంద్రమౌళి, ఎంఈఓలు పాల్గొన్నారు.

క్రీడాశిక్షణకు విద్యార్థులు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు ఎక్కువ మంది విద్యార్థులు వచ్చేలా చూడాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాలపై డీఈఓ, డీవైఎస్‌ఓ, సమ్మర్ క్యాంపు ఇన్‌చార్జ్‌లతో కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రధానంగా 8 నుండి 12 ఏళ్ల పిల్లలు శిబిరాలకు వచ్చేలా, ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉండేలా చొరవ తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇప్పించాలని చెప్పారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పది, పట్టణ ప్రాంతాల్లో 25 క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పరంధామరెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓలు, కోచ్‌లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



సదనంలో వంటలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్‌పాషా సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలల సదనాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడి వసతులను పరిశీలించారు. ఆతర్వాత విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్య, బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలల శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ సెక్రటరీ, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఉచిత భోజన, వసతితో కూడిన ఉచిత శిక్షణ జూన్ 1వ తేదీన మొదలవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పరీక్షలకు ఇచ్చే శిక్షణ కోసం నిరుద్యోగులు వచ్చే నెల 14వ తేదీలోగా టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు వచ్చేనెల 21న పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వంద మందిని శిక్షణకు ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 98484 94290, 951517 30477 నంబర్లలో సంప్రదించాలని డీడీ సూచించారు.

దివ్యాంగుల జాబ్‌మేళాలో 40మంది ఎంపిక



ఇంటర్వ్యూలకు హాజరైన దివ్యాంగులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం జెడ్పీ హాల్‌లో గురువారం నిర్వహించిన దివ్యాంగుల జాబ్ మేళాకు 107 మంది హాజరయ్యారు. మొత్తం 65 పోస్టులకు ఎంపిక కోసం జాబ్‌మేళా ఏర్పాటుచేయగా, అర్హులు 40మందిని ఎంపిక చేశామని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో పాటు, ఉపాధి కల్పన శాఖ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్‌మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈమేరకు గురువారం పదో తరగతి పరీక్షకు ఉదయం 22మందిలో 20మంది, మధ్యాహ్నం పరీక్షకు 14మందిలో 12మంది హాజరయ్యారు. ఇక ఇంటర్మీడియెట్ పరీక్షకు 982 మందిలో 819మంది హాజరు కాగా, 163మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు వెల్లడించారు.

చదువు, నైపుణ్యంతోనే విజయాలు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంఅర్బన్: చదువు ప్రాధాన్యతను తెలుసుకుని అందరూ విద్యనభ్యసించడమే కాక ఎంచుకున్న రంగంపై పట్టు సాధిస్తే ఉన్నత స్థాయికి చేరడం సులువవుతుందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నర్సింగ్, కంప్యూటర్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశాక కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్నందున శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. ప్రాంగణం అధికారి వేల్పుల విజేత, ఉద్యోగులు నాగసరస్వతి, హిమబిందు, స్పందన, మల్లిక్, రమేష్, విజయకుమార్, వెంకటేశ్వర్లు, దుర్గారావు, శాంతమ్మ, కల్యాణి, లాలయ్య, సుకన్య, మంజుల, అరుణ, షానాజ్ పాల్గొన్నారు.

రాత పరీక్షకు రెడీ..

- ఈనెల 30న కానిస్టేబుల్ అభ్యర్థులకు తుది రాతపరీక్ష
- జిల్లాలో 21 కేంద్రాలు.. 12,156మంది అభ్యర్థులు
- వివరాలను వెల్లడించిన సీపీ విష్ణు ఎస్.వారియర్



సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో కానిస్టేబుళ్లుగా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇప్పటికే తొలిదశ రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్ష నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన వారికి తుది రాతపరీక్ష ఈనెల 30న జరగనుంది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని 12,156 మంది అభ్యర్థుల కోసం ఖమ్మం జిల్లా కేంద్రంలో 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. ఈమేరకు పరీక్ష నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను గురువారం ఆయన గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

గంట ముందు నుంచే అనుమతి

జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహణకు 21 కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని సీపీ వారియర్ తెలిపారు. అయితే, అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు, వేలిముద్రల నమోదు, ఫొటో పరిశీలన చేపట్టాల్సి ఉన్నందున గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఇదేక్రమంలో అభ్యర్థులు చేతులకు గోరింటాకు, మెహందీ లేకుండా రావాలని తద్వారా బయోమెట్రిక్ నమోదు త్వరగా పూర్తవుతుందని చెప్పారు. కేంద్రాల పరిసరాల్లో ఊరేగింపులు, ప్రదర్శనలకు అనుమతి ఉండదని, 500 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తామని తెలిపారు. కాగా, పరీక్ష సమయంలో నిర్వహణ, పర్యవేక్షణ అధికారులు మినహా ఎవరికీ కేంద్రాల్లోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఇక కేంద్రాల వద్ద మహిళా అభ్యర్థులను తగిన సంఖ్యలో మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులను నియమిస్తామని తెలిపారు. అభ్యర్థులను ప్రలోభపెట్టేందుకు యత్నిస్తున్న పైరవీకారులను ఉపేక్షించేది లేదని, ఇలాంటి వారిని గుర్తించేందుకు కేంద్రాల సమీపాన లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ ప్లీనరీలో జిల్లా నేతలు



ధన్యవాదాల తీర్మానం ప్రవేశపెడుతున్న ఎమ్మెల్యే సండ్ర



మంత్రి కేటీఆర్‌తో మంత్రి పువ్వాడ, ఎంపీలు వద్దిరాజు, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన ప్లీనరీలో జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, రాములునాయక్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కొత్తూరు ఉమామహేశ్వరరావు దిండిగల రాజేందర్ తదితరులు హాజరయ్యారు.

తీర్మానం ప్రవేశపెట్టిన ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ ప్లీనరీలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టారు. దళితజాతి సంక్షేమం కోసం విప్లవాత్మకమైన దళితబంధు పథకం ప్రవేశపెట్టడం, నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రజల తరఫున ఎమ్మెల్యే సండ్ర ధన్యవాదాలు చెబుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. అలాగే, దేశవ్యాప్తంగా దళితబంధు అమలు చేయాలని, పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని తీర్మానించారు.

ధాన్యం కేంద్రాల నిర్వహణపై దృష్టి

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: యాసంగిలో సాగు చేసిన వరి చేతికి రావడం, అకాల వర్షాలతో తడుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఆలస్యమవుతున్నాయని రైతులు పలుచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. ఈ నేపథ్యాన జిల్లా స్థాయి అధికారులు కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు. ఈమేరకు సత్తుపల్లి, రామానగరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల గురువారం పరిశీలించారు. కుప్పల్ల పంపిణీ, తేమ శాతంను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆతర్వాత గంగారంలోని విత్తనశుద్ధి కేంద్రాలను తనిఖీ చేశారు. ఏడీఏలు యు.నర్సింహారావు, బి.శ్రీనివాసరెడ్డి, ఏఓ వై.శ్రీనివాసరావు, ఏఈఓలు ఆషాజ్యోతి, స్వాతి, నరేష్, సొసైటీ అధ్యక్షులు చల్లగుండ్ల కృష్ణయ్య, చిలుకూరి కృష్ణమూర్తి, మందపాటి వెంకటరెడ్డి, తుమ్మూరు శ్రీరాంప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది ఎదురుకావొద్దు

కూసుమంచి/ముదిగొండ: రైతులు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు ఎప్పటికప్పుడు చేపడుతూ మిల్లులకు తరలించాలని డీఆర్డీఓ విద్యాచందన సిబ్బందిని ఆదేశించారు. కూసుమంచి మండలం పాలేరు, ముదిగొండ మండలం గోకినెపల్లిలోని ధాన్యం కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. లారీలు సమయానికి రావటం లేదని, మిల్లుల్లో దిగుమతి ఆలస్యమవుతోందని రైతులు చెప్పగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఏపీఎంలు సత్యవర్ధన్‌రాజు, చినవెంకటేశ్వర్లు, కల్పన, సీసీలు కోట్యా, అనురాధ పాల్గొన్నారు.



సత్తుపల్లి టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల



పాలేరులో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్డీఓ

అడవులకు పూర్వ వైభవం

పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్



ఆళ్లపల్లి రేంజ్‌లో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ లోకేష్, అధికారులు

చుంచుపల్లి: భద్రాద్రి సర్కిల్ పరిధిలోని ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అడవులకు పూర్వ వైభవం తీసుకొస్తామని అటవీ శాఖ ముఖ్య సంరక్షణాధికారి(పీసీసీఎఫ్) లోకేష్ జైస్వాల్ తెలిపారు. భద్రాద్రి జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవుల అభివృద్ధికి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. 340 ఫారెస్ట్ బ్లాక్‌ల్లోని 6,29,442 హెక్టార్లలో పునర్జీవన పనులు చేపట్టామని తెలిపారు. 361 కిలోమీటర్ల మేర అటవీ సరిహద్దుల వెంట కందకాలు తవ్వించామని, ఐదేళ్లలో 8,619 బౌండరీ పిల్లర్లను నిర్మించామని చెప్పారు. 71 కిలోమీటర్ల మేర అటవీ సరిహద్దుల వెంట ఇనుప కంచె ఏర్పాటు చేశామని, 9.3 కిలోమీటర్ల మేర రక్షణ గోడలను నిర్మించామని వివరించారు. అటవీ ప్రాంతాల్లో జలసంరక్షణకు 5,214 రాతి కట్టడాలు, 388 నీటి కుంటలు, 88 చిన్న నీటి కుంటలు, 314 చెక్ డ్యామ్‌లు, 29 వాచ్ టవర్లను నిర్మించినట్లు వివరించారు. అటవీ ప్రాంతాల్లో సిబ్బంది నివాసానికి 55 ఇళ్లు నిర్మించామన్నారు. అడవులలో మంటల నివారణకు 3,773 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. 14,012 హెక్టార్లలో ప్లాంటేషన్లను పెంచామని వివరించారు. స్థానిక వృక్ష, గడ్డి జాతుల సంరక్షణకు 2,239 హెక్టార్లలో కలుపు మొక్కలు తొలగించినట్లు చెప్పారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా అడవుల స్థితిగతులపై ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం తెలంగాణలో 632 చ.కి.మీ. మేర అటవీ విస్తీర్ణం పెరిగిందని, దేశంలోనే ఇది రెండో అతిపెద్ద పెరుగుదల అని పీసీసీఎఫ్ ఈ సందర్భంగా వెల్లడించారు.

అభయారణ్యంలో పర్యటన..

ఇల్లెందు/ఇల్లెందు రూరల్/పాల్వంచ/పాల్వంచరూరల్: అభయారణ్యంలోని వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై వైల్డ్‌లైఫ్ సిబ్బంది దృష్టి సారించాలని పీసీసీఎఫ్(కంపా) లోకేష్ జైస్వాల్ ఆదేశించారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని ఇల్లెందు, గుండాల మండలాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కాచనపల్లి సెక్షన్‌లో 40 హెక్టార్ల పాత ప్లాంటేషన్, 55 హెక్టార్ల కొత్త ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. ఇల్లెందు మండలంలోని కోరగుట్ట చుట్టూ కంపా నిధులతో నిర్మిస్తున్న అర్బన్ పార్క్ పనులను కూడా పీసీసీఎఫ్ తనిఖీ చేశారు. తొలుత పీసీసీఎఫ్ కొమురారంలో రేంజ్ కార్యాలయం, పోలారంలో సెక్షన్ ఆఫీసర్ కార్యాలయం, క్వార్టర్లను ప్రారంభించారు. అలాగే, పాల్వంచలో నిర్మిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీసీఎఫ్ భీమా నాయక్, డీఎఫ్ఓలు రవికిరణ్, రంజిత్‌నాయక్, వసంత, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఎఫ్‌డీఓలు కృష్ణమాచారి, దామోదర్ రెడ్డి, తిరుమలరావు, మక్బూద్, చంద్రశేఖర్, అప్పయ్య, బాబు, మంజుల, రేంజర్లు నర్సింహారావు, జశ్వంత్ ప్రసాద్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దీపిక, అనిల్, డీఆర్ఓ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ



సీఎం కేసీఆర్‌కు ప్రసాదం అందిస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గురువారం వేకువజామునే స్వామిని దర్శించుకున్న ఆయన, ఆతర్వాత హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ప్లీనరీకి హాజరయ్యారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలిసి శ్రీ వారి ప్రసాదం అందజేశారు.

రేపు ప్రపంచ పశువైద్య దినోత్సవం

ఖమ్మంవ్యవసాయం: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు కార్యాలయంలోని డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటుచేసే రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఇంధన పొదుపుతో ఆదాయం పెంపు

సత్తుపల్లిటౌన్: ఇంధన పొదుపు పాటించడమంటే ఆర్టీసీ ఆదాయాన్ని పెంచినట్లేనని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎస్తేర్ ప్రభులత తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలోని గ్యారేజీని గురువారం పరిశీలించిన ఆమె బస్సుల నిర్వహణ, మైలేజీ తదితర అంశాలపై ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, శ్రీరామనవమి సందర్భంగా రీజియన్‌లోనే అత్యధికంగా 1,934 తలంబ్రాల బుకింగ్ చేయడం ద్వారా సత్తుపల్లి డిపో ప్రథమ స్థానంలో నిలిచిందని చెబుతూ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, కార్గో ఇన్‌చార్జ్ మునీర్ పాషాను అభినందించారు. అత్యధిక బుకింగ్‌లు చేసిన వై.నర్సింహారావు, కిన్నెర ఆనందరావు, మునీర్‌పాషా, ఎస్.సునీతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విజయవాడ రూట్ సర్వే నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ వెంకటనారాయణ, ఎస్ఎం గడ్డం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహన ఇన్సూరెన్స్ పేరిట మోసం

పెనుబల్లి: వాహనానికి బీమా చేయిస్తామని ఫోన్‌లో నమ్మబలికి డబ్బు తీసుకుని రశీదు ఇవ్వకుండా మోసం చేసిన వైనంపై వీఎం బంజర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈమేరకు ఎస్సై జి.సూరజ్ గురువారం వెల్లడించిన వివరాలు... వీఎం బంజర్‌కు చెందిన దోసపాటి చైతన్య బొలేరో ట్రక్ వాహనం ఇన్సూరెన్స్ గడువు ముగియనుండడంతో ఫిబ్రవరి 25న చోళ ఇన్సూరెన్స్ కంపెనీ బాధ్యుల పేరిట కొందరు ఫోన్ చేశారు. ఫోన్ పే నగదు చెల్లిస్తే రాయితీ లభిస్తుందని చెప్పడంతో చైతన్య రూ.12,500 చెల్లించాడు. ఆతర్వాత రశీదు కోసం సదరు నంబర్‌లో సంప్రదిస్తే స్పందన లేకపోగా, సత్తుపల్లిలోని చోళ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని సంప్రదించాడు. అయితే, నగదు తీసుకున్న వారు నకిలీ వ్యక్తులని చెప్పడంతో ఆయన గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై సూరజ్ తెలిపారు.

రుణగ్రహీతల ఇళ్లలో సామగ్రి జప్తు



సాతానిగూడెంలో సామగ్రి జప్తు చేస్తున్న అధికారులు

కామేపల్లి(కారేపల్లి): డీసీసీబీ ద్వారా రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తిరిగి చెల్లించకపోవడంతో వారి ఇళ్లలోని సామగ్రిని అధికారులు గురువారం జప్తు చేశారు. కామేపల్లి మండలం పొన్నెకల్లు, గోవింద్రాల, కెప్టెన్ బంజర, సాతానిగూడెంల్లో బకాయిదారుల ఇళ్లలోని వస్తువులను అధికారులు జప్తు చేసి తరలించారు. పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో జప్తుచేశామని అధికారులు తెలిపారు. మేనేజర్లు లక్ష్మయ్య, నరసింహారావు, శ్రీవాణి, ఉద్యోగులు డి.విక్రమ్, ఫణి, భరత్, గాదె నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,025	5,000
కందులు	7,750	7,600
అలసంద	6,500	6,500
మిర్చి	22,650	15,000
మిర్చి తాలు	11,500	9,000
పత్తి	7,462	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

మార్మోగిన రామనామం..

- వైభవంగా శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ
- నేడు బేడా మండపంలో శ్రీరామ పట్టాభిషేకం





ఇరుముడులతో శ్రీరామ దీక్షాపరులు (ఇన్‌సెట్) స్వామివారి రథసేవలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

భద్రాచలం: భద్రగిరి క్షేత్రం రామమయంగా మారింది. శ్రీరామ దీక్షాధారుల రామనామస్మరణలతో పులకించింది. నియమనిష్టలు, భక్తి శ్రద్ధలతో దీక్ష చేపట్టిన భక్తులు గురువారం ఆలయంలో దీక్ష విరమణ చేశారు. తొలుత భద్రుని గుడిలో శ్రీరామ పాదుకలకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. వాటిని ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ శిరస్సుపై ధరించగా మేళతాళాలు, వేదపండితుల ఆశీర్వచనాలు, అర్చకుల మంత్రోచ్చరణలు, భక్తులు, శ్రీరామ మాలధారుల జయ జయ ధ్వానాల నడుమ భద్రగిరి చుట్టూ ప్రదక్షిణ చేశారు. బేడా మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహంఇచారు. అనంతరం మాలధారులు స్వామివారికి ఇరుముడులు సమర్పించగా అర్చకులు దీక్షా విరమణ గావించారు. ఆ తర్వాత అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. యాగశాలలో సంక్షేప రామాయణ హవనం గావించారు. సాయంత్రం స్వామి వారికి వెండి రథ సేవ, చుట్టూ సేవలు జరిపారు.

స్వామివారికి నేడు పట్టాభిషేకం..

బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు గురువారం కనుల పండువగా జరిపారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం బేడా మండపంలో రామయ్యకు నిత్యకల్యాణం అనంతరం పట్టాభిషేకం జరపనున్నారు. కాగా శ్రీరామ దీక్షాపరులకు ఆలయ అధికారులు రూ.100 టికెట్‌తో పట్టాభిషేకంలో పాల్గొనే అవకాశం కల్పించారు. వీరికి శ్రీరామమాడతో పాటు స్వామివారి ప్రసాదాన్ని అందజేయనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్, ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రేపు సత్తుపల్లిలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటన

సత్తుపల్లి: రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ ఈనెల 29న సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి హెలీకాప్టర్‌లో చేరుకోనున్న ఆయన రూ.3.40కోట్లతో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంను ప్రారంభిస్తారు. ఆతర్వాత వేంసూరు మండలం వెంకటాపురంలో ఏర్పాటు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు సత్తుపల్లి మండలం గంగారంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి హైదరాబాద్ బయలుదేరతారు. కాగా, సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు దొడ్డా శంకర్‌రావు, శ్రీను, వెంకటరత్నం, మల్లయ్య, మోటపోతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను జయప్రదం చేయండి..

కల్లూరు రూరల్: కల్లూరులోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంను ప్రారంభించేందుకు ఈనెల 29న వస్తున్న రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటనను జయప్రదం చేయాలని కల్లూరు ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ కోరారు. ఈసందర్భంగా గురువారం వారు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడగా, నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి స్తంభాద్రి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం (గుట్ట)లో వచ్చేనెల 2వ తేదీ నుంచి వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవ, శ్రీ సుదర్శన యాగ, కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. వచ్చే నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగగా.. 2వ తేదీన ఉత్సవాల ప్రారంభం, 3న సుదర్శన యాగం, 4వ తేదీన శ్రీ నృసింహ స్వామి జయంతి వేడుకలు, 5వ తేదీన మూల విరాట్‌కు కలశాభిషేకం, స్వామి వారి కల్యాణ మహోత్సవం, 6వ తేదీన శ్రీ సుదర్శనయాగం, మహాపూర్ణాహుతి ఉంటాయని పేర్కొన్నారు.

నేటి నుంచి వీరన్నస్వామి జాతర



మాట్లాడుతున్న ఏఈఎస్ హన్మంతరావు

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో శుక్రవారం ప్రారంభం కానున్న వీరన్న స్వామి జాతరను విజయవంతం చేయాలని సరూర్‌నగర్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్, జాతర కమిటీ ప్రతినిధి బాగం హన్మంతరావు పిలుపునిచ్చారు. ఆలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నానాటికీ భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యాన దాతల చేయూతతో అభివృద్ధి చేయాలనే భావిస్తున్నట్లు తెలిపారు. కాగా, శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగే జాతరకు హాజరయ్యే భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఇక జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమవుతాయని కమిటీ బాధ్యులు హన్మంతరావు, చావా కోటయ్య వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఏలూరి శ్రీనివాసరావు, బెల్లం శ్రీనివాసరావు, రాంమోహన్‌రావు, ఇంటూరి అశోక్, రామారావు, బెల్లం వాసు, వీరశేఖర్, వీరశేఖర్, బొల్లినేని వెంకటేశ్వరరావు, చావా హరి, నంబూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు

- అయినా పట్టింపు లేనట్లుగా పాలకులు
- పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

కారేపల్లి: మహిళలపై రోజురోజుకు అఘాయిత్యాలు పెరుగుతున్నా పాలకులు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గాదె ఝాన్సీ, అందె మంగ విమర్శించారు. కారేపల్లిలో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి పీఓడబ్ల్యూ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఝాన్సీ, మంగ మాట్లాడుతూ పాలకులు చట్టాల అమలులో విఫలం కావడంతో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారు బయట తిరుగుతున్నారని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని విమర్శించారు. కాగా, గ్రేహౌండ్ పోలీసులు ఆదివాసీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయినా, దోషులకు నేటికి శిక్ష పడకపోవటం, పాలకులు వారిని కాపాడటం చూస్తుంటే ప్రజాస్వామ్యం అమల్లో ఉందా, లేదా అని ప్రశ్నించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెప్పారు. కాగా, తెలంగాణలో మద్యం ఏరులై పారిస్తున్న పాలకులు ఆడబిడ్డల ఉసురుతీసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత పీఓడబ్ల్యూ పతాకాన్ని ఝాన్సీ, మంగ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ, తదితర సంఘాల నాయకులు జి.అనసూర్య, పి.మణి, అరుణోదయ నాగన్న, పి.లక్ష్మి, వై.జానకి, ఎం.రాజేంద్రప్రసాద్, వై.ప్రకాశ్, కంచర్ల శ్రీనివాసరెడ్డి, రామ్మూర్తి, మోహన్‌రావు, బి.రాంజీ, ఎల్.కోమల్, బి.గోవర్ధన్, ఆలెం సుగుణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట జేపీఎస్‌ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జేపీఎస్‌లు

ఖమ్మం సహకారనగర్: సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సైదులునాయక్ మాట్లాడుతూ తమ సర్వీస్ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈమేరకు జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ వీ.వీ.అప్పారావు వారితో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్‌కు జేపీఎస్‌లు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో శ్రీధరరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా జాఫర్ బావి



బావి వద్ద పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో జాఫర్ బావి నుంచి మురుగు పూర్తిగా తొలగించి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆయన గురువారం బావిలో మురుగు తొలగింపు పనులను పరిశీలించి ఇంజనీరింగ్ ఉద్యోగులకు సూచనలు చేశారు. బావిలో వ్యర్థాలను పూర్తిగా తొలగించాక ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. తొలుత నగరంలో పలు వెంచర్లను కూడా కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శైలజ, డీఈ నవ్యజ్యోతి, ఏఈ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘లిఫ్ట్’ ఇవ్వరూ!



ఎంసీహెచ్‌లో నిలిచిపోయిన లిఫ్ట్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చేవారు వినియోగించే లిఫ్ట్ తరచుగా మొరాయిస్తోంది. ఆస్పత్రిలో మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వెళ్లివచ్చేందుకు ఇటీవల లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే, మరమ్మతుకు వస్తుండడంతో ఇన్‌పేషంట్‌గా ఉన్న వారు ఇబ్బంది పడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆపరేషన్ థియేటర్ ఉండగా.. నిత్యం ముప్పైకి పైగా ప్రసవాలు జరుగుతాయి. ఆతర్వాత బాలింతలను పై అంతస్తుకు తీసుకెళ్లడం, డిశ్చార్జ్ అయిన వారు కిందకు వచ్చేందుకు ఉపయోగపడే లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు.

ఎప్పటికప్పుడు బియ్యం దిగుమతి

ఖమ్మం సహకారనగర్: రైస్ మిల్లుల నుండి వచ్చే కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను లారీల నుండి ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ ఎఫ్‌సీఐ డీఎంను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎఫ్‌సీఐ, పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార, రవాణా శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై అదనపు కలెక్టర్ మీక్షించారు. జిల్లాలో ఏర్పాటుచేసిన కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 8,198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ ధాన్యం నిల్వకు మిల్లుల్లో స్థలం లేనందున, సీఎంఆర్‌ను ఎప్పటికప్పుడు తీసుకుంటే మిల్లులు ఖాళీ అవుతాయని చెప్పారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, జిల్లా మేనేజర్ సోములు, డీఆర్డీఓ విద్యాచందన, డీసీఓ విజయకుమారి, ఆర్‌టీఓ కిషన్‌రావు పాల్గొన్నారు.

నేడు తెలుగు రాష్ట్రాల స్థాయి పద్యగాన పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: పద్యగాన పోటీల మహాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళ్లకూరి నారాయణరావు జయంతి సందర్భంగా శుక్రవారం ఖమ్మంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పద్యగాన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చందాల కేశవదాసు కళాపరిషత్ అధ్యక్షుడు కొండపల్లి జగన్మోహన్‌రావు, పద్యనాటక పరిషత్ బాధ్యుడు వనం కృష్ణారావు వెల్లడించారు. చింతామణి, వరవిక్రయం, మధుసేవా నాటకాల నుంచి ఏ పద్యాలనైనా రెండింటిని పాడాలని తెలిపారు. వివరాల కోసం 73866 61631, 94404 66522 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు సీపీఐ ఉమ్మడి జిల్లా సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ ఉమ్మడి జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ప్రజాపోరు యాత్రతో పాటు భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

సెక్యూరిటీ గార్డుల ఎంపికకు పోటీలు

సత్తుపల్లిటౌన్: సింగరేణిలో సంస్థలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల కోసం ప్రైవేట్ ఏజెన్సీ ఆధ్వర్యాన గురువారం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించగా, 17 పోస్టులు గాను 70మంది హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చాటిన అభ్యర్థులను తొలి దశలో ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లాలయ్య (ఫైల్)

వైరారూరల్: మినీ వ్యాన్ అతివేగంతో వెళ్తున్న ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఏన్కూరు మండలం బురదరాఘవపురానికి చెందిన మేడి లాలయ్య(29) బోనకల్ మండలం రావినూతలలోని అత్తగారింటికి మిత్రుడు భాగం కళ్యాణ్‌తో కలిసి బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వైరా మండలం రెబ్బవరం శివారులో మధిర వైపు నుండి వస్తున్న మినీ వ్యాన్ అతివేగంగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో లాలయ్యకు తీవ్రగాయాలు కాగా, వెనుకాల కూర్చున్న కల్యాణ్ చేయి విరిగింది. ఈమేరకు హెడ్‌కానిస్టేబుల్ షేక్ ఘనీ సిబ్బంది చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న లాలయ్య గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

మధిర: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం ఉదగమండలం నీలగిరీస్ గ్రామానికి చెందిన సులేమాన్ (30) రైలులో వెళ్తున్నాడు. ఈమేరకు గురువారం మండలంలోని తొండలగోపవరం – మధిర రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు జారిపడడంతో మృతి చెందాడు. ఆయన వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా చిరునామా తెలుసుకుని బంధువులకు సమాచారం ఇచ్చినట్లు జీఆర్పీ ఎస్ఐ భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ శీలం వేణుగోపాలరెడ్డి తెలిపారు. కాగా, మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఊరికి వెళ్లొచ్చే సరికి చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. మామిళ్లగూడెంకు చెందిన చండాలయ శ్రీను కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 24న ఇంటికి తాళం వేసి నల్లగొండలో బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో ఉన్న సుమారు రూ.60వేల విలువైన బంగారు, వెండి నగలు చోరీకి గురైనట్లు గుర్తించిన శ్రీను ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.



బస్సుపై కూలిన చెట్టు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ మైదానంలో నిలిపిన అద్దె బస్సుపై గురువారం ఎండిపోయిన చెట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. నిత్యం ప్రయాణికులు సంచరించే ప్రాంతమే అయినా ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఆతర్వాత బస్సును విజయవాడ సర్వీస్‌గా పంపించారు.